క్లుప్తంగా

కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అభినందిస్తున్న ఏపీజీఈఏ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ప్రతినిధులు నూతన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ని శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన్ను కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలభాస్కరరావు, అధ్యక్షుడు కేవీ రమణ, రాష్ట్ర కార్యదర్శి ఎల్‌వీ యుగంధర్, రాష్ట్ర పెన్షనర్స్ నాయకులు పి.రామచంద్రరావు, పి.భూషణరావు, ఆదినారాయణ, పి.మేరీ, చంద్రశేఖర్ ఉన్నారు.

ధనలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: దుప్పాడ గంగానగర్‌లోని శ్రీ క్షేత్రంలో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనలక్ష్మి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ అమ్మవారికి అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజ, భక్తులు పాల్గొన్నారు.

జూలై 1 నుంచి ‘స్టాప్ డయేరియా’

విజయనగరం రూరల్: వచ్చే నెల 1 నుంచి నెలరోజుల పాటు స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో డయేరియా, ఇతర కాలానుగుణ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం తాజాగా జూలై 1 నుంచి 30 రోజుల పాటు స్టాప్ డయేరియా కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆదేశించిందన్నారు. దీనిపై ప్రజారోగ్య సిబ్బంది, కార్యదర్శులు, ప్రతి సచివాలయ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశుభ్రపరచాలన్నారు.

మెనూ ప్రకారం భోజనం



స్టాక్ పరిశీలిస్తున్న రామానందం

నెల్లిమర్ల: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి బి. రామానందం అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ.. బోధన, భోజనం వివరాలపై ఆరా తీశారు. అలాగే వసతిగృహంలో స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ ఏడాది పాఠశాలలో 90 శాతం విద్యార్థులు చేరడం మంచి పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కర్రి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు ఇప్పించండి

గజపతినగరం రూరల్: నియోజకవర్గ కేంద్రం గజపతినగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని డీటీ టి.సత్యనారాయణను ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కోరారు తెలిపారు.తహసీల్దార్ కార్యాలయంలో డీటీని ఎస్ఎఫ్ఐ నాయకులు రాము, ఈశ్వరరావు,కళాశాల విద్యార్థులు శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కళాశాలలో సమస్యలను డీటీకి వివరించారు. లోటెట్టేజీ సమస్య వల్ల కళాశాలలోని ఆర్వో ప్లాంట్ సరిగా పనిచేయడం లేదని, అలాగే మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా చేపట్టడం లేదని, స్వీపర్లు రాకపోవడంతో విద్యార్థులే తరగతి గదులను శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని చెప్పారు. ప్రభుత్వ వసతి గృహంలో సీట్లను ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు కేటాయిస్తున్నారని, కళాశాలలో సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం..

- పొంచి ఉన్న వ్యాధుల కాలం
- జాగ్రత్తలు పాటించకుంటే అంతే..
- బలవర్ధకమైన ఆహారంతో పాటు పరిశుభ్రత ముఖ్యం



పోషక విలువలతో కూడిన కూరగాయలు, పండ్లు

పూసపాటిరేగ : వర్షాకాలం ప్రారంభమైంది. ఈ సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సరైన జాగ్రత్తలు పాటించకపోతే రోగాల బారిన పడక తప్పదు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ రోగ నిరోధకశక్తి పెంచుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, సరైన ఆహార అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే ఎక్కువ మంది వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు పౌష్టికాహారం ఆవశ్యతను ప్రజలకు వైద్యాధికారులు వివరిస్తున్నారు. వీలైనంతవరకు నిల్వ చేసిన ఆహారం, తీపి పదార్థాలకు దూరంగా ఉండాలి. రడీమేడ్ ఆహారం, ఫ్రిజ్‌లలో నిల్వ ఉన్న కూల్‌డ్రింక్‌లు, ఆహార పదార్థాలు తీసుకోకపోవడం ఉత్తమం.

రోజు వారి ఆహారం ఇలా ..

ఉదయం 2 ఇడ్లీలు లేదా 60 గ్రాములు గింజ ధాన్యాలు, 25 గ్రాముల పప్పు ధాన్యాలు, 150 మిల్లీ లీటర్ల పాలు తీసుకోవచ్చు. 11 గంటల సమయంలో ఏదో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయను తీసుకోవాలి. ఇవేవీ అందుబాటులో లేకపోతే గ్లాసు పాలైనా తాగాలి. మధ్యాహ్న భోజనంలో 75 గ్రాములు గింజ ధాన్యాలతో చిరుతిండి. కప్పు పాలు తాగాలి. రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా చపాతి లేదా పుల్కా కూరగాయలతో కూడిన కూరను తీసుకోవాలి. ప్రతిరోజూ 150 మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలి. టీ , కాఫీ అవసర్లున్న వారు రోజుకు ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే తాగాలి.

పప్పుధాన్యాలు

ఆహారంలో పప్పులు, మినుములు, శనగలు, బాదంపప్పు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజూ ఏదో ఒక ఆకుకూర 100 గ్రాములు ఉండేలా చూసుకోవాలి. జామి, ఉసిరి, నిమ్మ ఏదో ఒకటి తప్పనసరిగా తీసుకోవాలి. రోజూ ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్ లేదా మటన్ తీసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం, మిరియాలు, అల్లం , వెల్లుల్లి బాగా ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడి పాలు, వేడినీరు, టీలో కలుపుకొని తాగితే ఉపశమనం కలుగుతోంది.

ఆహారపు అలవాట్లు

ప్రతి పూట భోజనానికి ముందు తర్వాత సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రమైన ఆహారం తీసుకున్నట్లయితే వ్యాధులు దరిచేరవు. ఆహారాన్ని ఒకేసారి కాకుండా కొంచెం, కొంచెం ప్రతి మూడు గంటలుకు ఒకసారి తీసుకోవడం ఉత్తమం. రోజు తినే ఆహారంలో తాజా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేస్తాయి. తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను జ్యూస్ రూపంలో తీసుకోవచ్చును.

మంచి ఆహారంతోనే ఆరోగ్యం



ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం, పప్పుధాన్యాలు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏదైనా బాగా ఉడికించిన ఆహారం తీసుకోవాలి. విటమిన్లు ఉన్న ఆహారం తీసుకున్నట్లయితే ఆరోగ్యవంతంగా ఉంటాం.

– ప్రమీలాదేవి, డాక్టర్, పూసపాటిరేగ పీహెచ్‌సీ

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: సేంద్రియ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. మండలంలోని వల్లూరు రైతుభరోసా కేంద్రం వద్ద రైతులకు రాయతీపై వరి విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందన్నారు. ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని సాగునీటి కాలువుల దుస్థితిని ఇప్పటికే సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని, సేంద్రియ సాగు విధానాన్ని రైతులు అలవర్చుకోవాలని తెలిపారు. రైతులకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి మాట్లాడుతూ.. ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్న రాయతీ విత్తనాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది నిత్యం రైతులకు అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, టీడీపీ నాయకులు కర్రోతు బంగారాజు, సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్, గేదెల రాజారావు, మాజీ ఎంపీపీ సువ్వాడ వనజాక్షి, ఏటపూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధారాణి

- ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల: వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి. రామారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించి మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. తాగునీటి పథకాల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ జరిపించి మంచినీరు అందించాలన్నారు. కార్యక్రమంలో రైల్వే సౌత్‌సెంట్రల్ బోర్డు సలహాదారుడు అంబళ్ల శ్రీరాములునాయుడు, ఈఓపీఆర్‌డీ కె. సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా కృష్ణంరాజు



నియామక ఆదేశాలు అందజేస్తున్న డీఈఓ ప్రేమకుమార్

విజయనగరం అర్బన్: కొత్తవలస మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పి.కృష్ణంరాజు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) సెక్రటరీగా ఎంపికయ్యారు. ఈ మేరకు డీఈఓ ఎన్. ప్రేమకుమార్ శుక్రవారం ఉత్తర్వులు అందజేశారు. కృష్ణంరాజు స్వతహాగా జాతీయ స్థాయి వాలీబాల్ క్రీడాకారుడు. ఎంతో మందిని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. ఆయన ఎంపికపట్ల రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి భగవాన్‌దాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, కేవీఏఎస్ రాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తరాంధ్రకు పోలవరం ఓ వరం

- మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాబూరావు

చీపురుపల్లి: పోలవరం ప్రాజెక్టు ఉత్తరాంధ్రకు ఓ వరం లాంటిదని,ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు కోరారు. పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు ప్రణాళిక ప్రకారం నిర్దేశిత ఎత్తులో పూర్తి చేస్తే ఉత్తరాంధ్రలోని జిల్లాల్లో 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పంటల సాగు కోసం రైతులు వర్షాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాల్లో సన్న, చిన్నకారు రైతులు వలసలు వెళ్లే పని కూడా ఉండదన్నారు. అలాగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్ర ప్రజలకు తాగునీరు కూడా సంపూర్ణంగా లభిస్తుందన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు క్రింద కేంద్ర ప్రభుత్వం పనులు చేస్తుందా లేదా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకుని పనులు నిర్వహిస్తుందా అనేది చూసుకుని, త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇది ఇలా ఉండగా జిల్లాల్లో నామినేటెడ్ పదవులను తక్షణమే నియామకం చేయాలని కోరారు. ప్రధానంగా డీసీసీబీ, డీసీఎంస్ వంటి పదవులకు ఎన్నికల ద్వారా లేదంటే నామినేటెడ్ విధానంలో భర్తీ చేయాలన్నారు. ఆర్‌ఈసీఎస్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా జరిగిన నియామకాలను రద్దు చేసి పూర్తి పారదర్శకతతో నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

పింఛన్ల పంపిణీలో భాగస్వాములు చేయడం సరికాదు

డెంకాడ: ఆరోగ్య సేవల కార్యక్రమాల్లో ఉన్న బిజీగా ఉన్న ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లకు పంఛన్ల పింపిణీ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం సరికాదని, ఈ నిర్ణయాన్ని ఉన్నతాధికారులు వెనక్కి తీసుకోవాలని ఏపీ ఎన్‌జీఓ భోగాపురం తాలూకా అధ్యక్షుడు కొమ్మూరి దుర్గారావు, మహిళా కార్యదర్శి కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒకపక్క ఇమ్యునైజేషన్, మరోపక్క అడల్ట్ బీసీజీ, 104 ఆరోగ్య శిబిరాల్లో పాల్గొనడంతో బిజీగా ఉండే సిబ్బందిని వేరే పనుల్లో ఎలా ఉపయోగిస్తారని ప్రశ్నించారు. పింఛన్ల పంపిణీ నుంచి వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలను తప్పించాలని కోరారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

పూసపాటిరేగ : మండలంలోని రెల్లివలస పంచాయతీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఇజ్జిరోతు అప్పలరాజు అధ్యక్షతన పంచాయితీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 46 లక్షల రూపాయలకు సంబంధించిన అభివృద్ధి పనులకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

1వ తేదీ నుంచి గ్రామసభలు

శృంగవరపుకోట: మండలంలో జూలై 1వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ వెంకటలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1వ తేదీన ధర్మవరం, ధారపర్తి, సంతగవిరమ్మపేట, 3న ఆలుగుబిల్లి, కిల్తంపాలెం, వీరనారాయణం, సీతారాంపురం, పోతనాపల్లి, వసి, 4న చామలాపల్లి, కొట్టాం, మూలబొడ్డవర, ఎస్.కోట తలారి, శివరామరాజుపేట, వేములాపల్లి, వెంకటరమణపేట, పెదఖండేపల్లి, వినాయకపల్లి, 5న రేవళ్లపాలెం , కొత్తూరు, కృష్ణాపురం, ముషిడిపల్లి, మామిడిపల్లి, 6న ఎస్.కోట గ్రామాల్లో సచివాలయాల వద్ద గ్రామసభలు నిర్వహస్తామని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో నూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ సభలు నిర్వహిస్తామని, సంతగవిరమ్మపేటలో మాత్రం మధ్యాహ్నం 2గంటలకు సభ నిర్వహిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ, జోగినాయుడు

శృంగవరపుకోట: రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, ఏపీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.వెంకునాయుడు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణం జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5తరగతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టేట్ సిలబస్‌ను అమలు చేసి, తెలుగు మాధ్యమంలో విద్యాబోధన అమలు చేయాలన్నారు. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్లను, నైట్‌వాచర్‌లను నియమించాలని, మోడల్‌స్కూళ్లలో కారుణ్య నియామకాలు అమలు చేయాలని కోరారు.

రాధాకృష్ణ సేవలు ఆదర్శం

- ఎమ్మెల్సీ రఘువర్మ, డీఈఓ ప్రేమకుమార్



రాధాకృష్ణ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, డీఈఓ ప్రేమకుమార్, తదితరులు

డెంకాడ: ఉపాధ్యాయుడిగా వృత్తి జీవితాన్ని మొదలుపెట్టి మండల విద్యాశాఖాధికారిగా ఎదిగిన సీహెచ్ రాధాకృష్ణ సేవలు ఆదర్శనీయమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, డీఈఓ ప్రేమకుమార్ అన్నారు. మండల ఎంఈఓ-2 విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన రాధాకృష్ణను మండలంలోని పినతాడివాడ యూపీ పాఠశాలలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాధాకృష్ణ ఉపాధ్యాయుడిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించి ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడిగా, మండల విద్యాశాఖాధికారిగా ఎదిగారని కొనియడారు. 40 సంవత్సరాల 5 నెలల ఉద్యోగ జీవితంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా, ఉత్తమ క్లస్టర్ కో ఆర్డినేటర్‌గా ఎంపిక కావడం వారి సేవలకు దక్కిన గౌరవమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి కేవీ రమణ, మండల విద్యాశాఖాధికారి వి.శ్రీరామ్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎంల గొడౌన్ పరిశీలన



అధికారులు, రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని ఈవీఎంల గోదామును కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు, గొడౌన్లకు వేసిన తాళాలు, సీళ్లను పరిశీలించారు. అలాగే అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గోదాములకు ఇరువైపులా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఇరువైపులా చెరువుల్లో మారిన పల్లపు ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. నీరు బయటకు పోయేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎంవీ సూర్యకళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి. ఉమాశంకర్, ఇరిగేషన్ ఈఈ ఎం. సీతారామునాయుడు, మున్సిపల్ కమిషనర్ బాలాజీప్రసాద్, ఎలక్షన్ సూపరింటిండెంట్ ప్రభాకర్, తహసీల్దార్ ధర్మరాజు, డీటీ మూర్తి, రాజకీయ పార్టీల నాయకులు సముద్రపు రామారావు, రేగాన శ్రీనివాసరావు, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

స్థలాన్ని కేటాయించండి



ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: పట్టణంలోని ఫూల్‌బాగ్‌లో ఉన్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి వెళ్లేందుకు స్థలాన్ని ఏర్పాటు చేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు వాక చిన్నంనాయుడు, ఈపు విజయ్‌కుమార్, సౌభాగ్యలక్ష్మి, తదితరులు కోరారు. ఈ మేరకు విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ, స్థల ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎం.భాస్కరరావు, కనకలక్ష్మి, ప్రవీణ్‌కుమార్, గాయత్రీ, శ్రీనివాస్‌శర్మ, దుర్గా నాగేశ్వరరావు, స్కౌట్ మాస్టర్లు ధనభూషణ్ నాయుడు, అక్కునాయుడు, గోపాలకృష్ణ , సుబ్రహ్మణ్యం, రాజారావు, ఎంవీ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు



సీహెచ్ తిరుమలరావు, కమిషనర్

విజయనగరం రూరల్: జూలై ఒకటో తేదీన నగరంలో పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టామని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పింఛన్ల పంపిణీ ఒకటో తేదీన పూర్తి చేయాలని, ఎవరైనా మిగిలిపోతే రెండో తేదీన శతశాతం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించామన్నారు. పింఛన్ పంపిణీ కేవలం ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే పాల్గొనాలని.. తాత్కాలిక ఉద్యోగులు పాల్గొనరాదని స్పష్టం చేశారు. ఇందుకోసం క్లస్టర్ వారీగా సిబ్బందిని మ్యాపింగ్ చేశామని, 50 నుంచి 60 మందిని ఒక క్లస్టర్‌లో చేర్చామని తెలిపారు. నగరంలో పింఛన్‌దారులు 23,303 మంది కాగా రూ. 16 కోట్ల 36 వేలు అందించనున్నట్లు చెప్పారు.

సంతల్లో ఆశీల వసూళ్లకు వేలం పాట



గజపతినగరం రూరల్: గజపతినగరంలో వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

వేపాడ: మండలంలోని బొద్దాం,వల్లంపూడి గ్రామ పంచాయతీల్లోని సంతల్లో ఆశీల వసూళ్లకు ఈఓపీఆర్డీ ఉమ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు.బొద్దాంలో డైలీ, వారపుసంతలో ఆశీల వసూలుకు రామేల దేముడు అనే వ్యక్తి రూ.1,46,500లకు వేలం పాడుకున్నారు. అలాగే వల్లంపూడిలో రోజు వారీ మార్కెట్‌లో ఆశీల వసూలుకు పార్థాన స్వామినాయుడు రూ. 50వేలకు పాడుకున్నారు. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు పద్మ,వెంకటరమణ సర్పంచ్‌లు ఎర్రా రామసత్యవతి, రుద్ర అంజిలీదేవీ పాల్గొన్నారు.

3వ తేదీకి వాయిదా

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలో రోజు వారీ మార్కెట్‌లో ఆశీల వసూళ్లకు శుక్రవారం వేలం పాట నిర్వహించగా, పంచాయతీ నిర్ణ యించిన ధరకు వేలం జరగకపోవడంతో జూలై3వ తేదీకి వేలం పాట వాయిదా పడింది. పంచాయతీ కార్యదర్శి రమణ మాట్లాడుతూ ఆశీల వసూళ్లకు పంచాయతీ నిర్ణయించిన ధర రూ.3,08,660 కాగా రూ.63 వేలుకే వేలం పాట జరగడంతో వాయిదా వేశామన్నారు. మూడుసార్లు వేలం పాట నిర్వహిస్తామని, అప్పటికీ పంచాయతీ నిర్ణయించిన ధర కంటే తక్కువగా వేలం జరిగితే నేరుగా పంచాయతీ సిబ్బందే మార్కెట్‌లో ఆశీలు వసూలు చేస్తారని చెప్పారు. ఈఓపీఆర్డీ జనార్దన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన



వేపాడ: సోంపురం పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు



వేపాడ: నీలకంఠరాజపురంలో వంటకాలను రుచిచూస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు



గజపతినగరం రూరల్: గజపతినగరం పాఠశాలలో వంటకాలను రుచి చూస్తున్న ఎంఈఓ-2 చక్రధర్

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం, సోంపురం ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును, భోజనాల నాణ్యతను ఎంఈఓ జగదీశ్వరరావు, ఎంఈఓ-2 బాలభాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. వంటకాలను రుచిచూసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల హాజరు, లెసెన్ ప్లాన్‌ను పరిశీలించారు. విద్యార్థులతో పాటాలు చదివించి, వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

మెనూ పాటించకుంటే చర్యలు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని బజారు సెంటర్ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను ఎంఈఓ-2 చక్రధర్ శుక్రవారం పరిశీలించారు. వంట కాలను రుచి చూశారు.రోజూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని, మెనూ పాటించకున్నా, నాణ్యమైన భోజనాలు అందించుకున్నా నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మరుగుదొడ్లను పరిశీలించారు.